# గూఢాచారి 000

**మేం** మాట్లాడుకోటం ఇంకా పూర్తి కాకుండానే శంకరంబాబుగారొచ్చారు దేవుడల్లే.

"శంకరంబాబుగారొచ్చారు?" అన్నాడు భద్రం.

"దేవుడల్లే" అన్నాను.

"ఏమిటి కథ?" అనడిగాడు శంకరం బాబు.

"నన్ను చెప్పనీ, భద్రం" అన్నాను భద్రం కేసి తీక్షణంగా చూసి.

"నువే చెప్పు, గురో. ఎవరు చెప్పినా యిసయవొకటేగా" అన్నాడు భద్రం. కొత్తగా వచ్చిన కొత్త సినీమా పత్రిక ఆడబొమ్మల దగ్గిర తెరుస్తూ.

"చూడు, శంకరం బాబూ. ఈ డిటెక్టివ్‌పని ఏవీ గిట్టుబాటుగాలేవు. ఇప్పుడు అంతకులు బయరంగంగానే అత్యాచారాలు చేస్తున్నారు. నువు డిటెక్టివ్ జేసేదేంటంటున్నాడు భద్రం."

"అదీ నిజమే, కేయాస్. ఈ మధ్య నువు డిటెక్టివు క్లబ్బుకేసి వెళ్లావా?"

"కిందటేడుగామాలెళ్లాను, శంకరంబాబూ."

"డిటెక్టివులెవరన్నా కనిపించారా?"

"క్లబ్బు తాళం పెట్టుంది."

"దాన్ని బట్టి ఏం గ్రహించావు?"

"క్లబ్బులో డిటెక్టివులెవరూ లేరని కనిపెట్టాను."

"భేష్. ఇంకోటి కూడా నువు కనిపెట్టి ఉండవచ్చు."

"అదేంటి శంకరం బాబూ?"

"డిటెక్టివులందర్నీ క్లబ్బులో పెట్టి ఎవరైనా బయట తాళం పెట్టి ఉండవచ్చు."

"హాత్తెరీ!" అన్నాడు భద్రం. వాడింకా అమ్మాయిల బొమ్మలే చూస్తున్నాడు. మా సంభాషణలో వాడు పాలుకొనటం లేదు.

"నీ తెలివి అమోఘం, శంకరం బాబూ" అన్నాను.

"చూడు, కేయాస్! డిటెక్టివుల కాలం వెళ్లిపోయింది. నేనన్నట్టు డిటెక్టివులందరినీ ఆ క్లబ్బులో పెట్టి ఎవరో తాళమే పెట్టారనుకో. అప్పుడా క్లబ్బుకు నిప్పు పెట్టేవాడు మొనగాడు. ఇప్పుడు వాళ్లదే రాజ్యం" అన్నాడు శంకరంబాబు.

"డిటెక్టివుగాళ్లనందరినీ చంపెయ్యటమే?" అన్నాను రహస్యంగా.

"వాళ్లెప్పుడో చచ్చారు. ఆ క్లబ్బులో డిటెక్టివులంటూ ఉంటే అవి వాళ్ల శవాలే అనుకో. ఏదైనా, మనుష్యులను లోపల పెట్టి ఇళ్లంటించేవాడే ఈనాడు హీరో. వాణ్నేవంటారో తెలుసా?"

"ఏవంటారు, శంకరం బాబూ?"

"గూఢచారి."

"ఎక్కడో విన్నట్టే ఉంది మాట."

"వినటమేమిటి? లోకవంతా ఆ మాట జపిస్తుంటే! గూఢచార్ల మీద నెలకు రెండు బళ్ల పుస్తకాలూ, ఇరవై బళ్ల సినిమాలూ వస్తున్నాయి. నువ్వు కీర్తి సంపాదించాలంటే గూఢచారివైపో" అన్నాడు శంకరం బాబు.

గూఢాచారి! ఆలోచిస్తున్నాను. భద్రం ఎరుగున్నవాళ్లలో ఇద్దరు చారిగాళ్లున్నారు. తస్సదియ్యా. వాళ్లు గూఢాచార్లే అయుండాలి. భద్రం నాతో వాళ్లను గురించి ఎన్నడూ చెప్పాడేకాడు. ఇంత చచ్చు అసిస్టెంటుతో నేనేం పైకొస్తాను?

"శంకరం బాబూ! ఈ గూఢాచారి కామామీషంతా అరటిపండొలిచినట్టు నాకు చెప్పెయ్యండి. నేను కూడా ఓ చారీ అయిపోతాను" అన్నాను.

"గూఢచారి అనేవాడు అయిదు పిస్తోళ్లూ, అయిదు కత్తులూ, పది పదిహేను లక్షల రూపాయలూ వెంటబెట్టుకు తిరుగుతాడు. వాడికి విమానాల్లో టిక్కెట్టు లేకుండా ప్రయాణాలు! పెద్ద పెద్ద హోటళ్లలో బస! రోల్స్ రాయిస్ కార్లలో షికార్లు, అంతా రహస్యం. వాడెవడో ఎవరికీ తెలీదు. ఇవాళ ఇక్కడుంటాడు. రేపు అమెరికాలో ఉంటాడు. ఎల్లుండి రష్యాలో వాడు చేసేపని ఏమిటని అడుగు... అని దేశాలకూ గూఢచార్లుంటారు. ఒక దేశపు గూఢచార్లను ఇంకోదేశపు గూఢచార్లు చంపుతూ ఉంటారు. మన దేశం పైకి రావాలనుకో. మన దేశపు గూఢచారి మనకన్న గొప్ప దేశపు గూఢచారిని చంపటం అవసరం. యుద్ధాలదేవుంది? బోడియుద్ధాలు? మొన్న జరిగిన యద్ధంలో మనం కోట్లకొద్దీ చైనావాళ్లని చంపాం. లక్షలకొద్దీ పాకిస్తాను వాళ్లను చంపాం. దాంతో ఏవీ తేలదు. మాంచి లావాంటి చైనా గూఢచారిని పట్టుకుని ఖతం చేసినట్టయితే చైనావాళ్లు, మాకు కమ్యూనిజం వద్దు బాబో అని సంధి చేసేసుకునేవాళ్లు. రష్యా ఎందుకు బలంగా ఉంది. వారానికోసారి వాళ్ల అగ్ర నాయకులంతా సమావేశమై జటాయువుల్లాంటి విదేశ గూఢచారుల్ని ఖతం చెయ్యటానికి కావలసిన తీర్మానాలూ అవీ చేస్తూ ఉంటుంది... మన డిటెక్టివు క్లబ్బులో ఆర్నెల్ల కింద మిలటరీ హోటలు పెట్టారు. అందుచేత నువు గూఢచారివైపో."

వహరహస్యంతో నాకళ్లు మూతలుబడ్డాయి. నేనొక గూఢాచారిని. విమానాల్లో టిక్కెట్టు లేకుండా రష్యా, అమెరికా, పారిస్, లండన్ అన్నీ తిరిగేస్తున్నాను! నా జేబుల్లో అయిదు పిస్తోళ్లు! నా బొడ్డులో అయిదు కత్తులు! ఆకాశాన్నంటే ఓటళ్లలో మకాం!

"అన్నట్టు, గూఢచారికి నంబరుండాలి. గూఢచారి 123, గూఢచారి 456, గూఢచారి 789 - అట్లా."

"నెంబరెందుకు, శంకరం బాబూ?"

"నంబరే ముఖ్యం. నంబరునుబట్టి ఎటువంటి గూఢచారీ, ఏం చేస్తాడూ, ఏమిటి కథా- అంతా తెలుస్తుంది."

"నా కేదన్నా మంచి నెంబరియ్యి, శంకరంబాబూ-"

"మూడు సున్నాలు నీ నెంబరుగా పెట్టుకో."

"మూడు సున్నాలకర్థం?"

"మొదటి సున్నా, నువు హత్యలు చెయ్యగలవని; రెండో సున్నా, హత్యలు చేసేవాళ్లను హత్యలు చెయ్యగలవని; మూడూ సున్నా, ఎప్పుడు బడితే అప్పుడు ఎవరిని బడితే వారిని హత్యలు చెయ్యటానికి నీకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని."

"అంటే అత్యచేసినా బొక్కలో వెయ్యరా, శంకరంబాబూ?"

"నిన్ను గూఢచారిగా నియమించే ప్రభుత్వం అరెస్టు చెయ్యదు. పై దేశాల వాళ్లు నిన్ను పట్టుకున్నా మనవాళ్లు నిన్ను కాపాడటానికి విశ్వప్రయత్నం చేస్తారు."

ఆలోచిస్తున్నాను. ఈ గూఢాచారి పని డిటెక్టివ్‌కు పూర్తిగా తలకిందులుగా ఉన్నది. గూఢాచారంటే అంతకుడన్న మాట. డిటెక్టివు కానేకాదు.

"గూఢాచారికి కూడా అసిస్టెంటు ఉంటాడా, శంకరంబాబూ?" అనడిగాను.

"గూఢచారికెవరూ ఉండరు. వాడిది ఒంటరి జీవితం."

"మరి భద్రం మాటేమిటి?"

"ఇటువంటి తుంగభద్రంగాళ్లు గూఢచారికి రోజు కరడజను మంది సహాయం చేస్తుంటారు. కాని వెంట ఎవరూ ఉండరు. కావలిస్తే భద్రాన్ని సెక్రటరీగా ఉండనీ. టెలిఫోన్ దగ్గిర కూర్చోవటమే వాడి పని. నీకు పనిపడినప్పుడల్లా ఆ టెలిఫోనులో పిల్చి పని చెబుతావు. ఆ టెలిఫోను కూడా రహస్యపు టెలిఫోను."

భద్రం అసిస్టెంటుగా ఉండటం మాని సెక్రటరీ అవుతాడన్నమాట. ఎంత చెడ్డా, భద్రం లేందే నేను గూఢాచారి మూడు సున్నాలు కావడం కష్టం.

"నీ ఆఫీసు కూడా ఎవరికీ తెలీకూడదు. ఏ గొడ్లపాకలోనో, గడ్డివామిలోనో రహస్యంగా గది ఉంటుంది. అందులోనే టెలిఫోనూ, టెలివీజర్, టెలిప్రింటర్, టేప్‌రికార్డర్,

రేడార్, ఎలెక్ట్రాన్, ప్రోటాన్, టెట్రాన్ అన్నీ ఉంటాయి. టెట్రానుకూ హైట్రానుకూ మధ్య నక్కి భద్రం రేడారు మీద టెలివిజరులో మాట్లాడుతుంటాడు.

హాశ్యర్యం! హత్యాశ్చర్యం! గూఢాచారిలో కూడా సయించుందన్నమాట.

"అయితే, శంకరంబాబూ! గూఢాచారిలో కూడా సయించుందన్నమాట!"

"కనిపెట్టేశావే!"

"కులూ దొరికితే ఆపాటి తెలుసుకోలేనా, శంకరంబాబూ. ఎంత చెడ్డా తలదిరిగిన డిటెక్టివును గదా!" అన్నాను.

శంకరంబాబు లేచాడు.

"అయితే, బాబూ! నన్ను గూఢాచారినెపుడు చేస్తారు? నాకు గూఢాచార్రై పోవాలని మహా హతహతగా ఉంది" అన్నాను.

"తొందరపడకు. రహస్య డిపార్టుమెంట్ రహస్యశాఖలో రహస్య గూఢచారి అధికారి 22-33-44తో మాట్లాడి నీకు రహస్య ఆర్డర్లొచ్చేట్లు చూస్తాను - అంతదాకా ఈ పుస్తకాలకట్ట చదువుతూండు" అని శంకరంబాబు 114 పుస్తకాలు చంకలోనించి తీసి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

"భద్రం!" పిలిచాను.

"ఏంటి, గురో?"

"ఈ పుస్తకాలు ఒకొటొకటే రహస్యంగా చదివి నాకు వినిపించు."

"ఒక్కఛనం, గురో. ఈ ఒక్క బొమ్మా చూసేసి..." అంటూ భద్రం ఒక దిసెమొల బొమ్మలో లీనమయాడు.

***ముద్రణ : యువ, నవంబర్ 1966***